క్లుప్తంగా

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

పాలకొండ : మహిళలు ఆర్థికంగా ముందంజ వేయాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. నగర పంచాయతీ పరిధిలో మహిళలకు 90రోజుల పాటు ఇవ్వనున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ సద్వినియోగం చేసుకుని కుట్టు మిషన్లు పొంది ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే ఈ కుట్టుమిషన్ల ద్వారా ఇంటి నుంచి పనిచేసుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నం రాజు తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లక్కగూడ నుంచి సదునుగూడ వరకు కొత్తగా నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గురువారం ప్రారంభించారు. రూ.75 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఆమె వెంట కురుపాం ఏఎంసీ చైర్మన్ కడ్రక కళావతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ ఎం.నారాయణమ్మ ఆధ్వర్యంలో రోడ్లు, కాలువల్లోని చెత్తాచెదారాన్ని సిబ్బంది ఏరివేసి, డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం రోడ్లుకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లారు. పంచాయతీ ఆర్థికసంఘం నిధులతో శానిటేషన్ పనులు చేస్తున్నామని పంచాయతీ కార్యదర్శి పాపారావు తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణత

గుమ్మలక్ష్మీపురం: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2024–25 సీబీఎస్ఈ ఫలితాలు ఉదయం విడుదలయ్యాయని, ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

దుర్గమ్మ సేవలో..

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఇటీవల వివాహాలతో ఒక్కటైన నూతన వధూవరులతో పాటు పట్టణ, మండల ప్రజలు అమ్మవారి సేవలో తరించారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, మనీల్‌కుమార్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భామిని: మండలంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతు పనులు చేపట్టనుండడంతో దీని పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ బి.శ్రీనివాస్ తెలిపారు. కొరమ నుంచి బత్తిలి వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పార్వతీపురం రూరల్: వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి తీరాలని, తద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చునని పార్వతీపురం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు అన్నారు. పార్వతీపురం శివారులోని వెంకంపేట గ్రామ సమీపంలో గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. కొరాపుట్ అంతర్రాష్ట్ర రహదారిపై వచ్చీపోయే వాహనాలను ఆపి సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలను నడిపేందుకు ఇవ్వకూడదని అవగాహన కల్పించారు. ఆటోలను, లగేజీ వాహనాలను ఆపి వాటి పత్రాలను పరిశీలించారు. ఆటో డ్రైవర్లు ఏకరూప దుస్తులను ధరించాలని, అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు.

చెత్త తొట్టెగా రక్షణ వలయం

పార్వతీపురం: పార్వతీపురంలోని ట్రాఫిక్ కూడలి సమీపంలోని బైపాస్ రోడ్ పరిధిలో వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ వలయాన్ని చెత్త తొట్టెగా స్థానికులు వినియోగిస్తున్నారు. ఈ రహదారి పరిధిలో నిత్యం వందలాది మంది రాకపోకలు చేస్తుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ గతంలో నిర్మించిన రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక వ్యాపారులు, గృహస్తులు ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ వలయంలో ఇష్టానుసారంగా చెత్తను పారబోస్తున్నారు. దీనివల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఒక్కోసారి చెత్తను కాల్చి తగలబెడుతున్నారు. దీంతో ఒక్కోసారి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడే అవకాశం వుంది. అలాగే ప్రమాదం జరిగే అవకాశం వుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ వలయంలో వేసిన చెత్త

ఆర్‌బీకేని ఇలా వదిలేశారు...



సీతంపేట మండలం గొయిది ఆర్‌బీకే కేంద్రాన్ని అర్ధాంతరంగా పనులు చేయకుండా వదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.28 లక్షల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టారు. అనంతరం ఎన్నికల రావడం, ప్రభుత్వం మారడంతో ఇప్పటికీ పనులు చేపట్టలేదు. ఇది పూర్తయితే రైతులకు ఎంతో ఉపయోగపడేది. ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారి పిచ్చి మొక్కలు మొలిచాయి. – సీతంపేట

పొంచి ఉన్న ప్రమాదం



గుమ్మలక్ష్మీపురం–పార్వతీపురం ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డులో గుమ్మగదబవలస గ్రామ సమీపంలోని వంతెనపై ప్రమాదం పొంచి ఉంది. బ్రిడ్జి రెయిలింగ్(వంతెనపై ఇరువైపులా ఉండే గోడలు) కూలిపోయింది. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులంతా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనం అదుపుతప్పి కిందపడినా, బ్రిడ్జిపై ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించబోయి ఢీకొన్నా నేరుగా వంతెన కిందకి పడిపోవాల్సిందేనని వాపోతున్నారు. ఇదే విషయమై ఆర్అండ్‌బీ జేఈ సుశీలను సంప్రదించగా వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు రాగానే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. –గుమ్మలక్ష్మీపురం

నీటి తొట్టెలో నీరేదీ..!



భామిని మండలంలోని బత్తిలిలో మూగజీవాల కోసం దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెలలో నీరు ఉండడం లేదు. మండు వేసవితో మూగజీవాల దాహం తీర్చేందుకు వీటిని నిర్మించారు. అయితే వీటిని నీటితో నింపాల్సి ఉంది. కానీ ఈ పని చేయడం లేదు. దీంతో ఈ తొట్టెలు చాలా చోట్ల నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. – భామిని

సమ్మెకు సమాయత్తం



గుమ్మలక్ష్మీపురం: సమ్మెకు తరలిరావాలని పిలుపునిస్తున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ:

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేపడుతున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు, ఉద్యోగులు సమాయత్తమవుతున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం పట్టణంలో పలు ప్రజా సంఘాల నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కొల్లి గౌరీశ్వరి మాట్లాడుతూ ఆశాలను కార్మికులుగా గుర్తించి, రూ.26వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేసే జీవోను రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పోస్టర్లు ఆవిష్కరించారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.



పాలకొండ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆశా వర్కర్లు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రభుత్వ రంగ పరిశ్రమలు, కార్మికుల హక్కుల పరిరక్షణ ప్రధాన డిమాండ్‌గా ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్యలు కోరారు. కురుపాం మండలంలోని మొండెంఖల్లు సంతతోట వద్ద వ్యవసాయ కార్మికులతో సమావేశమైన ఆయన.. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతున్నామని, ఇదే విషయమై జరిగే సమ్మెలో అందరూ పాల్గొనాలన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో పలురంగాల కార్మికులతో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ గురువారం సమావేశమయ్యారు. ఈ నెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, కార్మికుల హక్కులకు భద్రత వంటి అంశాలతో చేపట్టే ఈ సమ్మెకు ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశంకరావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు సత్యవతి పాల్గొన్నారు.

తరలిపోతున్న పశు సంపద

భామిని: మండల కేంద్రంలో నిర్వహించే వారపు సంత నుంచి పాడి పశువులు చేతులు మారి తరలిపోతున్నాయి. మండు వేసవిలో కనీసం తాగునీరు పెట్టకుండా వారపు సంతల్లో సేకరించిన పాడి పశువులను సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామానికి దూరంగా వాహనాల్లో ఎక్కించి కబేళాలకు తరలిస్తున్నారని పశు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వారపు సంత నుంచి తరలిస్తున్న పశు సంపద

రేషన్ కార్డులు మంజూరు చేయాలి

పార్వతీపురం: అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్లకు రేషన్‌కార్డులను మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పలు ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లకు రేషన్‌కార్డులు, ప్రభుత్వ పథకాలు వర్తించేటట్టు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి ఎలాంటి సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, ఇంటి స్థలాల మంజూరు వంటి పథకాలు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయాలన్నారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, చేర్పులు, మార్పుల కోసం సచివాలయాలకు వెళ్లే వారికి పనులు జరగకపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

చేతి బోరుకు మరమ్మతులు

పాలకొండ రూరల్: మండలంలోని పద్మాపురం గ్రామంలో రక్షిత చేతి బోరు గత కొద్ది రోజులుగా మూలకు చేరిన క్రమంలో 'మూలకు చేరిన బోరు' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి సర్పంచ్ వి.రాజారావు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి గోవిందరావుతో మాట్లాడి దీన్ని బాగు చేయాలని సూచించారు. దీంతో గంటల వ్యవధిలో మరమ్మతులు పూర్తి చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



పద్మాపురంలో చేతి బోరుకు మరమ్మతులు

యంత్ర పరికరాలతో రైతుకు మేలు

భామిని: మండలంలోని ఘనసరలో రైతులకు వ్యవసాయ పరికరాలను గురువారం పంపిణీ చేశారు. ఏవో కె.సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయితీపై మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రకృతి సాగు నవధాన్యాల సాగు చేయాలని కోరారు. పీఎండీఎస్ కిట్లను అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. శిక్షకులతో మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

గరుగుబిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గరుగుబిల్లి, గొట్టివలస, గొల్లవానివలస, టీఆర్ఎన్ వలస, మరుపెంట, దళాయివలస, బీవీ పురం, పెద్దూరు, చినగుడబ, పెదగుడబ, వల్లరగుడబ, ఎస్ఆర్ పేట, కొత్తపల్లి, శివ్వాం, సీమలవానివలస, పోలినాయుడువలస తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కార్యాలయాలకు భవనాల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల కొనసాగింపునకు భవనాలను అధికారులు గురువారం పరిశీలించారు. శ్రీకాకుళం సెట్‌శ్రీ సీఈవో శ్రీధర్‌రాజా పరిశీలించారు. వెంకంపేట సమీపంలోని వసతిగృహ భవనాలు చూశారు. ఈ భవనాల్లో డీఎల్‌డీ, డీఎల్‌పీవో, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట డీఎల్‌డీవో గోపాలకృష్ణ ఉన్నారు.



భవనాలు పరిశీలిస్తున్న సెట్‌శ్రీ సీఈవో శ్రీధర్‌రాజా

ఫారంపాండ్‌ల పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాం, బల్లేరు ప్రాంతాల్లో నిర్మించిన ఫారంపాండ్‌లను జల్‌శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి సుగుణాకరరావు గురువారం పరిశీలించారు. ఫారంపాండ్‌లు ఏ విధంగా ప్రజలకు ఉపయోగపడుతున్నాయన్న విషయాలను సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. ఫారంపాండ్‌ల నిర్మాణ పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని, ఎవరిపైనైనా ఫిర్యాదులు వస్తే ఊరుకునేది లేదన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ధర్మారావు, ఏపీవో తులసిదాస్, జేఈ తేజ తదితరులు ఉన్నారు.



కొండచిలకాంలో ఫారంపాండ్‌లు పరిశీలిస్తున్న జల్‌శక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి సుగుణాకరరావు

నడి వీధిలో నీటి గుంతలు

భామిని: మండలంలోని గురండి వీధిలో నీటి గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇవి వాహన చోదకులకు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఇటీవల గురండి నుంచి నేరడి బీ వరకు వేసిన తారు రోడ్డు అరకొరగా వేసి విడిచిపెట్టారు. రెండు గ్రామాల మధ్య తారు రోడ్డు నామమాత్రంగా వేసి వదిలేశారు. దీంతో నీటి గుంతలు ఏర్పడి ఇబ్బందికరంగా మారాయి.



గురండి వీధిలో నీటి గుంతలు

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ రెసిడెన్షియల్(ఈఎంఆర్ఎస్)స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంఈసీ గ్రూపులో బాలురుకు 11 సీట్లు, బాలికలకు 4 సీట్లు, బైపీసీలో బాలురుకు 10 సీట్లు, బాలికలకు 2 సీట్లు, హెచ్ఈపీ గ్రూపులో బాలురు, బాలికలకు కలిపి 12 సీట్లు ఉన్నాయన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనట్లు మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పనివేళల్లో పాఠశాలను సంప్రదించాలని కోరారు.

కుట్టు.. అంతా కనికట్టు..!



బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణా కేంద్రం

- అధికారులకు తెలియకుండా శిక్షణా కేంద్రం ప్రారంభం
- అరకొరగా శిక్షణకు హాజరు

బలిజిపేట: మండల కేంద్రమైన బలిజిపేటలో స్కిల్ డవలప్‌మెంట్‌లో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ మహిళలకు ఇస్తున్న కుట్టు శిక్షణ ఒక కనికట్టులా తయారైంది. ఇటువంటి కార్యకలాపాలు స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించడం, అధికారికంగా కేంద్రాన్ని ప్రారంభించడం, నైపుణ్యాలను పెంపొందించేందుకు చేపట్టవలసిన చర్యలు పక్కాగా అమలు చేయడం వంటివి జరగాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వీటిని నిర్వహించడం విమర్శలకు దారి తీస్తుంది. బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ఒక ఖాళీ భవనంలో కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ కుట్టు శిక్షణ ఇస్తున్న విషయం స్థానిక ఎంపీడీవో నగేష్‌కు తెలియకపోవడం ఒకింత ఆశ్చర్య పరుస్తుంది. మొదటి విడతగా రెండు బ్యాచ్‌లలో 113మందికి శిక్షణ ఇచ్చేందుకుగాను 20కుట్టు మిషన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎవరు వస్తున్నారో, ఎవరు రాలేదో ఎవరికీ అంతుపట్టడం లేదు. 12వ తేదీన ప్రారంభించినా నేటికీ పూర్తి స్థాయిలో హాజరు కనిపించడం లేదు. కుట్టు శిక్షణను శ్రీ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేటు ఆర్గనైజేషన్‌కు అప్పగించినా వారు కనీసం స్థానిక అధికారులను కలవడం గాని, అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించకుండానే శిక్షణ నిర్వహిస్తున్నారు.

హాజరు వివరాలు ఇలా...

తేదీ	బ్యాచ్-1 హాజరు	బ్యాచ్-2 హాజరు	రోజుకు
	(ఉదయం 10గంటలు)	(మధ్యాహ్నం 2గంటలు)	హాజరైన వారు
12న	33	27	60
13న	24	29	53
14న	34	32	66
15న	29	30	59

339 దరఖాస్తులు

స్కిల్ డవలప్‌మెంట్‌లో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీ మహిళలకు కుట్టు శిక్షణ నిమిత్తం దరఖాస్తులు ఆహ్వానించారు. 18 నుంచి 50 సంవత్సరాలలోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. 90రోజుల శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో 75శాతం హాజరు ఉంటే అటువంటి వారికి శిక్షణ పూర్తయిన తరువాత కుట్టుమిషను ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. దీంతో మండలంలో 339 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో మొదటి విడతలో 113మందికి శిక్షణ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. శిక్షణా సమయంలో ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు ఒక బ్యాచ్‌గా విభజించారు. అందుకు సంబంధించి బలిజిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో ఉండే నూతన భవనాన్ని ప్రతిపాదించారు. దీనిని ఇవ్వచ్చా.. లేదా.. అనేది అధికారులకే తెలియాలి. శిక్షణ ఇచ్చేందుకు ఇద్దరు మహిళా బోధకులను నియమించారు. ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా.. స్థానిక ఎంపీడీవోకు కనీసం సమాచారం లేదు. ఇప్పుడు శిక్షణకు అర్హులైన 113మంది మినహా మిగిలిన వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా ఉంది.

నాకు తెలియదు..

పూర్తి స్థాయి పర్యవేక్షణ బాధ్యతలు మావే అయినా కుట్టు శిక్షణ ప్రారంభమైనట్టు ఎటువంటి సమాచారం నాకు తెలియదు. ఎప్పుడు ప్రారంభమైందో తెలియదు. దీనికి సంబంధించిన ప్రైవేటు ఆర్గనైజేషన్ వారు వచ్చి కలవలేదు, అక్కడకు కుట్టు మిషన్లు ఎన్ని వచ్చాయో కూడా తెలియదు. ఇంతవరకు పర్యవేక్షణ లేదు.
– నగేష్, ఎంపీడీవో, బలిజిపేట

అరకొరగా హాజరు

ఈ నెల 12వ తేదీ నుంచి శిక్షణను ప్రారంభించినా నేటికి పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. మొదటి విడతలో 113 మందికి శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. అందుకు శిక్షణా కేంద్రానికి 20 కుట్టుమిషన్లు మాత్రమే వచ్చాయి.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

సీతంపేట: మండలంలోని దేవనాపురం గ్రామంలో గురువారం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ వై.అమ్మన్నరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవడానికి ఈ తరహా క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు.

క్రీడలు శారీరక, మానసికోల్లాసా న్ని ఇస్తాయన్నారు. మొత్తం 50 జట్లు పాల్గొన్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలపై దాడులు

సీతానగరం: మండలంలో నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. నిడగల్లు గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వాహకుల స్థలాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. అంతకు ముందు మద్యం దుకాణాల్లో నిల్వలు, విక్రయ రికార్డులను పరిశీలించారు. అనంతరం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సోదాలు చేశారు.